# నమ్మి ఉంగరమిచ్చింది

★ చెరుకువాడ శ్రీరామమూర్తి ★



ఓరోజు ఆమే పిలిచింది, లోపలికి వెళ్ళాను. కూర్చున్నాక అంది : "పాపం! నాకోసం మీరు చాలారోజులనించి తిరుగుతున్నా రనుకొంటా! రాత్రి కెంత తీసికొంటానో తెలుసునా ?" వజ్రపు టుంగరాన్ని సవరించుకొంటూ అంది.

"ఊహించ లేదు" అన్నాను.

"నూరు రూపాయిలు !" అంది.

"సరే ! రాత్రికి వస్తాను" గుమ్మం దిగాను.

నిజాని కామె సౌందర్యానికి నూరు రూపాయిలు కాదు, ఎంతయినా ఇవ్వవచ్చును. నా దగ్గర కానీ అయినా లేందే !

స్వామిదగ్గర అప్పుచేసి ఆమె చేతిలో పెట్టాను. మరునాడు నూరు రూపాయిలు తీర్చవలసిన బాధ్యత మీద పడ్డది.

చేతిలో చిల్లికాని లేదు. నాన్న నడిగితే అంత పెద్దమొత్తమివ్వరు. ఆలస్యం చేస్తే మిత్రుడి దగ్గర గౌరవం పోతుంది. ఆమె సౌందర్యాకర్షణలో పడి ఇన్ని చిక్కులు తెచ్చిపెట్టుకొన్నాను.

అంతలో నాన్నపిలిచి "నేను ఊరికి వెళుతున్నా, స్వామిగారి కీ రెండువందలు ఇచ్చి రా!" అన్నారు.

బయలుదేరా ! డబ్బు జేబులో పడగానే దారిలో బుద్ధి మారిపోయింది. ఆమె సౌందర్యం మళ్ళీ ఆకర్షించింది. రేపు నేను ఎదుర్కోవలసిన చిక్కు లన్నిటికన్నా ఆమె ఆకర్షణ బలవత్తర మయింది.

స్వామికి వంద ఇచ్చి ఆమె ఇంటికి వెళ్ళాను మిగిలిన వందతో! సన్నిహితంగా సంతోషంతో ఆహ్వానించింది.

తెల్లారగానే డబ్బు సమస్య! గుండె దడ దడ కొట్టుకుంటున్నది, నాన్నకు తెలిస్తే ఇంటి ఆశ మరి లేదు !

ఆమె కిదంతా చెప్పి నా డబ్బు నా కియ్యమంటే ? బయలుదేరా! తీరా ఆమె ఇల్లు సమీపించేటప్పటికి భయం! వృత్తిలోఉన్న ఆమె హేళన చేస్తుందని వెఱ్ఱిగా ఇంటిలోనికి వెళ్లాను. కూర్చున్న తరువాత అంది :

"ఇవాళ రాత్రి వీలులేదు" అని విచారం కనబరుస్తూ !

"చిన్న సహాయం!"

"చెప్పండి! తప్పకుండాచేస్తాను."

నవ్వుతూ అన్నాను "నీ ఉంగరం మోసారి కావాలి ! పెండ్లిచూపుల కెళుతున్నా."

"ఓస్ ! ఇదేనా, తీసికెళ్లండి! కానీ నా కోరిక ! పెళ్లయినాక నన్ను మరిచిపోకండే !" అంది విచారంతో నవ్వుతూ !

"చా! నిన్ను మరిచిపోతానా? ఇంత మంచి హృదయంతో ప్రజ్వలిస్తున్న నిన్ను?"అన్నాను.

'పాపం నమ్మింది!' అని వెళిపోతు అనుకొన్నాను.

---

* ఆనందవాణి